AKSHARA TODAY
అక్షర రటుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

31-3-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

సర్పంచ్‌లు వచ్చినా.. తీరని సమస్యలు..

సొసైటీలో అక్రమాలపై సభ్యుల ఆందోళన

పోతంగల్‌లో విగ్రహాల ఊరేగింపు

అక్షరటుడే, కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయాన్ని పునర్నిర్మించారు.

అయితే నూతన విగ్రహ ప్రతిష్టాపనోత్సవంలో భాగంగా మంగళవారం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో, గణ పతి, నందీశ్వరుడు, హనుమాన్, శివలింగం, విగ్రహాలతో భాజా భజంత్రీల మధ్య ఊరేగింపు నిర్వహించారు.

అయ్యప్ప స్పర్శ దర్శనానికి పోటెత్తిన భక్తజనం

అక్షరటుడే, లింగంపేట: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఉత్తర శబరిమల ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నాల్గోరోజు అయ్యప్ప స్వామి స్పర్శ దర్శనం నిర్వహించగా భక్తులు పోటెత్తారు. లింగంపేటలో నూతనంగా నిర్మించిన ఉత్తర శబరిమల ఆలయంలో ప్రాణప్రతిష్ట వేడుకలకు మంగళవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరయ్యారు. అయ్యప్ప స్వామి స్పర్శ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఎక్కడాలేని విధంగా లింగంపేటలో ఉత్తర శబరిమల ఆలయం నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. ఏకశిలపై 18 మెట్లు రావడం అయ్యప్ప కటాక్షమేనన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రవి గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో హిందూ సమ్మేళనం

అక్షర టుడే, కమ్మర్‌పల్లి: మండలం కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా హాజరైన నర్ర వెంకట శివకుమార్, ప్రాంత సహ బౌద్ధిక ప్రముఖ్ మాట్లాడుతూ హిందువుల ఐక్యత కోసం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మనదేశంలో స్త్రీకి ఎంతో గౌరవం ఇస్తామన్నారు. అలాంటి స్త్రీకి కరచాలనం కంటే చేతులెత్తి నమస్కరించడం ఉత్తమమన్నారు. కార్యక్రమంలో విశోక తీర్థ స్వామీజీ, నరహరి స్వామీజీ (ఇస్కాన్), కొత్తపల్లి హరిక, సర్పంచ్ ఏనుగు గంగారెడ్డి, రాజేశ్వర్, ఉట్నూర్ రాజశేఖర్, సల్లూరి కిషన్, రుద్ర మధుసూదన్, దశగౌడ్, చెట్లపల్లి శంకర్ గౌడ్, సమేరా సుమన్, భోగ రామస్వామి, సుంకేట అశోక్, గడ్డం పురుషోత్తం, చింతకుంట శ్రీనివాస్, వినోద్, దొంతుల రమణయ్య, నరేందర్ డిష్, రెంజర్ల గంగాధర్, చింత ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాత ఆగం..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షాలు రైతులకు తీవ్రనష్టాన్ని మిగిల్చాయి. సోమవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కోతదశకు వచ్చిన వరి నేలవాలింది. మొక్కజొన్న, మామిడి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. ఇక నిజామాబాద్ నగరంలోని మార్కెట్ యార్డులు పసుపు పంట తడిసిపోయింది.

– అక్షరటుడే, నెట్‌వర్క్

నేలకొరిగిన చెట్టు

నీటిని తొలగిస్తున్న రైతు

మహిళలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

అక్షరటుడే, బాన్సువాడ: పట్టణంలోని బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకం విజయవంతమైన సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. బాన్సువాడ డిపో మేనేజర్ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మహాలక్ష్మి పథకం ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 290 కోట్ల మహిళా ప్రయాణాలు ఉచితంగా జరిగాయన్నారు. కార్యక్రమంలో కాసుల రోహిత్, కృష్ణారెడ్డి, గంగాధర్, ఎజాజ్, ఖాలెక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్ సీఐ రామన్ బదిలీ

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి రూరల్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న రామన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి సిద్దిపేట ఎస్బీలో పని చేస్తున్న శ్రీధర్ గౌడ్ రానున్నారు. కామారెడ్డి జిల్లాలో సదాశివనగర్, కామారెడ్డి రూరల్ సీఐగా రామన్ పని చేశారు. ఇక్కడ దాదాపు రెండేళ్ల పాటు పని చేసిన ఆయన తాజాగా బదిలీపై వెళ్లారు. ఆయనను హైదరాబాద్‌లోని ఐజీ కార్యాలయానికి ప్రభుత్వం బదిలీ చేసింది. కామారెడ్డి రూరల్ సీఐగా పని చేయడానికి అనేక మంది తమ ప్రయత్నాలు కొనసాగించినట్టుగా ప్రచారం సాగింది. గత కొంత కాలంగా రూరల్ సీఐ బదిలీ అవుతారన్న ప్రచారం నేపథ్యంలో ఇక్కడికి ఫలానా వ్యక్తి రానున్నారని పేర్లు చక్కర్లు కొట్టాయి. అయితే ఆ ప్రచారం అంతా ఉత్తదే అని తేలింది. సిద్దిపేట ఎస్బీలో పని చేస్తున్న శ్రీధర్ గౌడ్ కామారెడ్డి రూరల్ సిఐగా రానున్నారు. రేపోమాపో ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి సమష్టి కృషి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా కొనసాగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ సాయి చైతన్య సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లాస్థాయి సమావేశం జరిగింది. మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, వాటి నిరోధానికి అవలంభించాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్, సీపీ దిశానిర్దేశం చేశారు. గడిచిన రెండు మాసాల్లో జిల్లాలో ఎక్సైజ్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన దాడులు, పట్టుబడిన గంజాయి, అల్ప్రాజోలం ఇతర మత్తు పదార్థాలు, నమోదైన కేసుల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తున్న మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. పోలీస్, ఎక్సైజ్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కమిటీగా ఏర్పడి పక్కాగా కృషి చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలను చైతన్యపర్చేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఈవో అశోక్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల,డీటీవో ఉమా మహేశ్వరరావు, జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీడబ్ల్యూవో పద్మ తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: వచ్చే ఏడాది జూలైలో జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్‌ను కలెక్టర్ మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పక్షం రోజుల క్రితం సైతం పుష్కర ఘాట్ ను సందర్శించిన సమయంలో అధికారులకు అప్పగించిన పనులను తనిఖీ చేశారు. పుష్కర ఘాట్‌కు వచ్చేమార్గాల్లో రహదారుల మరమ్మతులు, విస్తరణ పనులను, శివాలయం వద్ద కొనసాగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలన్నారు. పుష్కరాల సమయంలోనే కాకుండా ఈ ప్రదేశానికి సాధారణ సమయాలలోనూ భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు భక్తులకు కనీస వసతులు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలన్నారు. గోదావరి పుష్కరాలకు త్రివేణి సంగమ ప్రాంతం అయినందున ఈ ఘాట్ వద్ద పుణ్య స్నానాల కోసం ప్రముఖులతో పాటు, లక్షలాదిగా భక్తులు పుణ్య స్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఘాట్ వద్ద ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వీవీఐపీల కోసం హెలిప్యాడ్‌ను నిర్మించాలని, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు వంటి వాటిని నాణ్యతతో చేపట్టి నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, దేవాదాయ శాఖ అధికారులు కమల, విజయరామారావు, తహశీల్దార్ శ్రవణ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఉన్నారు.

హనుమాన్ జయంతిని ప్రశాంతంగా జరుపుకోవాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

అక్షరటుడే, కామారెడ్డి : హనుమాన్ జయంతిని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఏప్రిల్ 2వ తేదీన హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలో నిర్వహించనున్న శోభాయాత్ర మార్గం, ఏర్పాట్లను ఎస్పీ రాజేష్ చంద్రతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ర్యాలీ సజావుగా, శాంతియుత వాతావరణంలో జరిగేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో చర్చించి కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. ప్రధాన కూడళ్లను సందర్శించి ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. ర్యాలీ నిర్వహణ ప్రతినిధులతో కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి వేడుకలను క్రమశిక్షణతో జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలోని ముఖ్య మార్గాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలు, సీసీటీవీల ద్వారా నిరంతరం నిఘా ఉంటుందని చెప్పారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా భక్తులు నిర్వాహకులు పోలీస్ శాఖ కు సహకరించి ఈ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, కామారెడ్డి పట్టణ సీఐ నరహరి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా పాలన ఏర్పాట్లపై సమీక్ష

అక్షరటుడే, బాల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని బాల్కొండ స్పెషల్ ఆఫీసర్, మిషన్ భగీరథ ఈఈ రాకేష్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. ఏప్రిల్ 2న జరిగే గ్రామ సభలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ప్రభుత్వ కార్యాలయాల శుభ్రత, రికార్డుల నిర్వహణ, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ప్రజా వినతులపై వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి, మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి గంగామోహన్, మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్, ఇతర మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగ్గురు కానిస్టేబుళ్లకు ప్రమోషన్

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. తెలంగాణ డీజీపీ నుంచి వారికి మంగళవారం ఆదేశాలు అందాయి. ప్రమోషన్లు పొందిన వారిలో బన్సీలాల్ (మహిళా పోలీస్‌స్టేషన్ నిజామాబాద్), నాగరాజు (పోలీస్ స్టేషన్ ఆర్మూర్), శ్రావణ్ కుమార్ (నందిపేట్ పోలీస్ స్టేషన్) ఉన్నారు. ఈ సందర్భంగా వారు సీపీ సాయి చైతన్యను జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ వారిని సన్మానించారు. కొంతకాలంగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న పోలీసులకు పదోన్నతులు లభించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీపీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

సర్పంచ్‌లు కొలువైనా.. తీరని సమస్యలు..

- తండాల్లో తాగునీటికి అవస్థలు
- పారిశుధ్యం అస్తవ్యస్తం.
- ప్రత్యామ్నాయ మార్గాలు చూడడంలో విఫలం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తండావాసులు

గ్రామాల్లో పాలకవర్గాలు కొలువైనా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పరిస్థితి నెలకొంది. రెండేళ్లకు పైగా ప్రత్యేకాధికారుల పాలనలో ఎన్నో అవస్థలు పడ్డామని.. కొత్త సర్పంచ్‌లు వచ్చినా.. మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాంధారి మండలంలోని కాయితీ తండా, నాగ్లూర్ తండా, నేరెళ్ల తండాలో పరిస్థితులు అధ్వానంగా మారాయని ఆయా తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – అక్షరటుడే, గాంధారి

గాంధారి మండలంలోని కాయితీ తండా, నాగ్లూర్ తండాల్లో నూతన పాలకవర్గాలు ఏర్పడినప్పటికీ సమస్యలు ఎక్కడికక్కడే తిష్ఠవేశాయని తండావాసులు ఆరోపిస్తున్నారు. తండాలో 550 మంది జనాభా ఉండగా.. నాగ్లూర్ తండాలో 500 మంది ప్రజలు నివసిస్తున్నారు. తండాలో ఇంటింటికీ చెత్త సేకరించే వాహనం రాక 15 రోజులుగా ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నీటి సమస్య ఉండడంతో ట్యాంకర్ కోసం స్థానిక ప్రజాప్రతినిధులకు, సెక్రెటరీకి విన్నవించామని పేర్కొన్నారు. పంచాయతీ సిబ్బందికి సైతం జీతాలు ఇవ్వకపోవడంతో వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో రెండు తండాల ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

కలెక్టరేట్‌కు తరలిన నేరెళ్ల తండావాసులు

గాంధారి మండలంలోని నేరెళ్ల తండా గ్రామపంచాయతీలో తీవ్రనీటి కొరత వేధిస్తోందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ విషయమై సర్పంచ్, సెక్రెటరీ, ఎంపీడీవో, మిషన్ భగీరథ అధికారులకు విన్నవించడం జరిగిందన్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. తండాకు నీటి సరఫరా చేయాలని విన్నవించారు. అలాగే తండాలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న కబ్జాలపై కూడా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.

నూతన పాలకవర్గం ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ గ్రామసభ నిర్వహించలేదని గ్రామస్థులు కలెక్టర్‌కు వివరించారు. అంతేకాకుండా గ్రామంలో పశువుల నీటితొట్టి ఉన్నప్రాంతాన్ని కొందరు కబ్జా చేసుకుని వాడుకుంటున్నారని చెప్పారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కొట్టల్, లక్ష్మాపూర్‌లలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: మండలంలోని కొట్టల్, లక్ష్మాపూర్‌లలో ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతోంది. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వలంటీర్లు ఆయా గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు కృష్ణ ప్రసాద్, రాజకీయ శాస్త్ర అధ్యాపకులు మోహిన్ ఖాన్ అడ్మిషన్ కంపెయినింగ్ నిర్వహించారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరితే కలిగే ఉపయోగాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించారు. దోస్త్ అడ్మిషన్స్ కోసం కృష్ణ ప్రసాద్ 9951281286 నంబరును సంప్రదించాలని సూచించారు.

మహిళా సంఘానికి శాశ్వత భవనం మంజూరుపై హర్షం

అక్షరటుడే, లింగంపేట: మండలంలోని ఎక్కపల్లిలో గ్రామ సంఘం భవనానికి నిధులు మంజూరు చేసిన సందర్భంగా సీఎం రేపంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దూషణ గారి దుర్గవ్వ మాట్లాడుతూ.. గతంలో మహిళా సంఘాలకు ఏ ప్రభుత్వం కూడా సమావేశాల నిమిత్తం భవనాలు మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అనేక విధాలుగా తోడ్పాటు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కోశాధికారి భాగ్యలక్ష్మి, గ్రామ సంఘం అధ్యక్షులు గంగమొల్ల స్వరూప, సీసీ సంజీవులు, గ్రామ సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

అక్షరటుడే, భీమ్‌గల్: మండలంలోని మోతె ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం గ్రామంలో వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. జూన్ నెలలో ప్రారంభం కానున్న నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా కరపత్రాలతో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన అందుతుందని వివరించారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు ఇవి సరైన వేదికలని చెప్పారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, పౌష్టికాహారం వంటి సదుపాయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ప్రైవేట్‌కు ధీటుగా డిజిటల్ విద్యను అందిస్తున్నామని, తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, రమేష్, శుభశ్రీ, బాబాజీ, సోనీ, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు అండగా మహాలక్ష్మి పథకం

అక్షరటుడే,ఆర్మూర్ : మహాలక్ష్మి పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అండగా నిలబడిందని ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.290 కోట్ల మంది ప్రయాణాలు చేయగా వారికి రూ.10వేల కోట్ల ప్రయాణ ఛార్జీలు ఆదా అయిన సందర్భంగా ఆర్మూర్ బస్టాండ్‌లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో మహిళలకు డబ్బులు ఆదా అవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఆర్టీసీ డిపో నుంచి నిత్యం ప్రయాణం చేస్తున్న పలువురు మహిళా ప్రయాణికులను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఎం సాయన్న, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సావిత్రి, ఆర్టీసీ ఉద్యోగులు డీవీఎస్ చక్రవర్తి, అశోక్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పోచంపాడ్ పీహెచ్‌సీలో వైద్య శిబిరం ప్రారంభం

అక్షరటుడే, మెండోరా: ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ మాధురి రాజు, ఉప సర్పంచ్ సతీష్, డాక్టర్ మద్దుల రాకేశ్ చేతుల మీదుగా శిబిరాన్ని ప్రారంభించారు. నిజామాబాద్ నుంచి వచ్చిన జనరల్, ఆర్థో, కంటి, ఎముకల, దంత వైద్య నిపుణులు పాల్గొని గ్రామస్థులకు వైద్య సేవలు అందించారు. వివిధ ఆరోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు ఇచ్చారు. ఈ శిబిరం ద్వారా గ్రామస్థులకు అవసరమైన వైద్య సేవలతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సేవలు ప్రజలకు మరింత చేరువ య్యాయని పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మాధవనగర్ ఆర్‌వోబీ వద్ద సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నగరంలోని సుభాష్‌నగర్ కు చెందిన అనురాగ్(18) సోమవారం అర్ధరాత్రి మాధవనగర్ వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తలకు గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని సమీప ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. 6వ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మాధవనగర్ శివారులోని రైల్వే ట్రాక్ వద్ద ఆర్‌వోబీ పనులు జరుగుతున్నాయి. అయితే రాత్రివేళల్లో ఆ ప్రాంతంలో చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. లైట్లు లేని కారణంగా ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు.

మాక్లూర్ సొసైటీలో అక్రమాలపై సభ్యుల ఆందోళన

అక్షరటుడే, మాక్లూర్ : మాక్లూర్ సొసైటీలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని సొసైటీ సభ్యులు, రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సొసైటీ ఎదుట సభ్యులు, రైతులు ఆందోళన చేశారు. సొసైటీలో అక్రమాలకు పాల్పడుతున్న బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.కోట్లల్లో రైతుల సొమ్ము దోపిడీ జరిగినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతిపరులపై చర్యలు తీసుకుని సొసైటీని కాపాడాలని కోరారు. కలెక్టర్ స్పందించి సొసైటీపై విచారణ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబంతో ప్రశాంతంగా గడపాలి: అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి

అక్షరటుడే, కామారెడ్డి : ఉద్యోగ విరమణ అనంతరం పోలీసు సిబ్బంది కుటుంబంతో ప్రశాంతంగా గడపాలని అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి అన్నారు. పదవీ విరమణ పొందిన బాన్సువాడ ఎస్సై ప్రకాష్, వీఆర్ ఎస్సై రాజయ్య, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నారాయణలను జిల్లా పోలీసు కార్యాలయానికి కుటుంబ సభ్యులతో సహా ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. సుమారు 40 నుంచి 42ఏళ్ల పాటు పోలీసు శాఖ కు అంకితభావం, క్రమశిక్షణతో సేవలందించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఆర్ఐలు నవీన్ కుమార్, కృష్ణ, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ల అప్పగింత..

అక్షరటుడే, ఆర్మూర్: పట్టణ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తిరిగి బాధితులకు అప్పగించినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పలువురు బాధితులు తమ ఫోన్లను పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసినట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం పోగొట్టుకున్న ఫోన్‌ను సైతం వెతికి పెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు బాధితులు సతీష్, నవీన్, రాజులకు ఫోన్లను ఎస్‌హెచ్‌వో అందజేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే.. టీయూసీఐ ఆధ్వర్యంలో నిరసన

అక్షరటుడే, బాల్కొండ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని టీయూసీఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని బస్సాపూర్, కిసాన్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద లేబర్ కోడ్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టాలు పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్నాయని విమర్శించారు. తక్షణమే వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ నజీర్, నిమ్మల నిఖిల్, వినోద్ కుమార్, దినేష్, రాజేష్, రాజు, విజయ, విజయ, విజయ, లక్ష్మి, కీర్తన, గంగాధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

అక్షరటుడే, లింగంపేట : మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారా గౌడ్ మాట్లాడుతూ.. లింగంపేట మండలానికి అత్యధికంగా రూ.కోటి ఎన్ఆర్ఈజీఎస్ నిధులను కేటాయించినందుకు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. ఎల్లారెడ్డి అభివృద్ధి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పీసీసీ మైనారిటీ కార్యదర్శి రఫీయోద్దీన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫతియోద్దీన్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సక్రు, ఉప సర్పంచ్ ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.